

శివరాత్రికి చంద్రబాబుకు ఆహ్వానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకాళహస్తిలో అంగరంగ వైభవంగా జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఈవో బాపిరెడ్డి సోమవారం ఆహ్వానం పలికారు. ముందుగా విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబుకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు. అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, ముక్కంటి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా చంద్రబాబు శ్రీకాళహస్తికి రానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే.

'పుస్తకాన్ని బతికించుకుందాం' ప్రదర్శన నేడు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'పుస్తకాన్ని బతికించుకుందాం...ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అంటూ మంగళవారం పుస్తకాలతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పుస్తక అభిమానులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, లౌకిక, అభ్యుదయవాదులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 8వ తేదీన పుస్తక ప్రదర్శనపై దాడికి పాల్పడిన మతోన్మాదులు కిరణ్‌కుమార్, సురేష్‌నాయక్, రమేష్‌బాబు, మరో పది మందిపై జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు అలిపిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. సున్నిత సమస్యపై వెంటనే స్పందించిన ఎస్‌పికి ఐక్యవేదిక నాయకులు పి.అంజయ్య, రాఘవ, వాకా ప్రసాద్, పరమేశ్వర్, ఒ.వెంకటరమణ, అజీమ్‌బాష, రామానాయుడు, వందవాసి నాగరాజు, విశ్వనాథం, హరీష్, సాయిలక్ష్మి, హేమలత, జయంతి, కె.వెంకటాద్రి కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రమాదంలో పుస్తకం' అంటూ మేధావులు, ప్రజాసంఘాల ఆందోళన

'ఆప్కాస్' రద్దు ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్

కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో ఆప్కాస్ రద్దు చేస్తానన్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని, జీవో నెంబర్ రెండు సవరించి అందరికీ మినిమం టైమ్ స్కేలు వర్తింపజేయాలని కోరుతూ సోమవారం శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఎడి బిల్డింగ్ ఎదుట ధర్నా జరిగింది. ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్న బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయ చంద్ర మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయడం వల్ల లక్షా 20 వేల మందికి నష్టం జరుగుతుందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే, పారదర్శకత లోపించి, నిజమైన మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ సరిగ్గా అమలు కాదన్నారు. ఏజెన్సీల అక్రమాలపై పోరాటాలు చేసిన ఫలితంగా గత ప్రభుత్వం ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఉద్యోగులందరిని ఒక గొడుగు కిందికి తీసుకొని వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ఔట్సోర్సింగ్ కార్పొరేషన్‌ను మళ్లీ ఏజెన్సీలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయడం అంటే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ నాయకులు మునిరాజా, గంగయ్య, సుభహాన్, బాబు నాయుడు, సాయిగోపి, గురు కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రము, ప్రజా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ శక్తిగా భారత్ అభివద్ధి.. 2047 వికసిత భారత్ గా అవతరణ' అని అంశంపై ఈనెల 14వ తారీకు నుంచి 16వ తారీఖు వరకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆన్లైన్, ఆఫ్లైన్ ద్వారా కూడా సాగే ఈ సదస్సు నందు వివిధ దేశాల పరిశోధకులు, మేధావులు తమ పరిశోధక పత్రాలను సమర్పించనున్నారని సదస్సు సంచాలకుడు ఆచార్య బివి మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి వివేక్, పాకనాటి హరికష్ణ, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

ప్రతి రైతూ విశిష్ట సంఖ్యాకార్డు తీసుకోవాలి

ప్రజాశక్తి - సత్యవేడు

భారతదేశంలోని రైతులందరికీ దేశమంతటిలో ఒకే సంయుక్త రైతు డిజిటల్ గుర్తింపు కార్డు (రైతు విశిష్ట సంఖ్య కార్డ్) పంపిణీని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నేపథ్యంలో సత్యవేడు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కేంద్రంలో ఏవో మురళి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సూచిస్తూ ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్యాకార్డును కలిగి ఉండాలని, లేకుంటే ప్రభుత్వం అందించే ఏ పథకానికి, రాయితీలకు అర్హులు కారని, ఈ రైతు డిజిటల్ గుర్తింపు కార్డులు పొందడానికి ఆయా స్థానిక ఆర్ ఎస్ కె సెంటర్ (రైతు సేవా కేంద్రం) లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కు అనుసంధానం అయిన ఫోన్ నంబర్ ఉన్న సెల్‌ఫోన్‌తో ఈనెల 28 లోపు సంప్రదించాలని కోరారు. విశిష్ట గుర్తింపు సంఖ్య లేకుంటే ప్రభుత్వ పథకాలైన పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంటల నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై సబ్సిడీ, ఎరువులు ,విత్తనాలపై పొందే రాయితీ వంటివి పొందడానికి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మదనం బేడు వీహెచ్ఏ టీ మురళి, సత్యవేడు వి ఏ వి స్వర్ణ, దాస్ కుప్పం వి ఏ టి రుద్రయ్య, గన్నవరం వి ఏ పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం... ఒంటరిగా పోరాడుతున్నా..

మీడియాతో కిరణ్‌రాయల్ బాధితురాలు లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జనసేన నాయకులు కిరణ్ రాయల్ మాయ మాటలకు మోసపోయి సర్వం పోగొట్టుకొని అందరికీ దూరమై ఒంటరిగా బతుకుతున్నానని, కేవలం తన వద్ద నుండి అతను తీసుకున్న కోటి 20 లక్షలు డబ్బు కోసమే పోరాడుతున్నానని కిరణ్ రాయల్ బాధితురాలు లక్ష్మీరెడ్డి అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో లక్ష్మీరెడ్డి కిరణ్ రాయల్‌కు తనకు ఉన్న పరిచయాలు, లావాదేవీలు, బర్త్ డే పార్టీలు వంటి అంశాలను ఆధారాలతో సహా మీడియాకు చూపించారు. కిరణ్ రాయల్ తనకు పరిచయమైన నాటినుండి తానే అన్ని తానై డబ్బులు విషయంలో సహాయ సహకారాలు అందించానని, గత పదేళ్లుగా కిరణ్ రాయల్ వాడిన ఫోన్లు అన్నీ తాను కొనిచ్చినవేనని అన్నారు. పవన్ కళ్యాణ్ వస్తున్నారని తన వద్ద నుండి ఎన్నోమార్లు డబ్బులు తీసుకున్నాడని పేర్కొన్నారు. 2015 లోనే తనతో లావాదేవీలు ముగిసిపోయాయని మీడియాకు చెప్పే కిరణ్ రాయల్ 2023లో తనకు లావాదేవీలకు సంబంధించి అగ్రిమెంటు ఎందుకు రాసి ఇచ్చాడో మీడియా వారు కూడా తెలుసుకోవాలన్నారు. తనపై లక్ష రూపాయలకు సంబంధించి సైబర్ క్రైమ్ కేసు నమోదు అయిందని, ఇప్పటికే జైపూర్ పోలీసులు తనతో మాట్లాడి వెళ్లారన్నారు. తన అబ్బాయి సర్జరీ కోసం అత్యవసరమై కిరణ్ రాయల్ను డబ్బు అడిగితే తన వద్ద నుండి బ్లాంక్ చెక్కు తీసుకొని ఒకటిన్నర నెల ముందు లక్ష

రూపాయలు ఇచ్చాడన్నారు. తన వెనుక జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ ఉన్నారని, నీ బిడ్డలను చంపుతా అంటూ బెదిరిస్తున్నాడన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనకు అండగా నిలిచి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. కాణిపాకంలో కిరణ్ రాయల్ తనకు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదని ప్రమాణం చేస్తే, ఈ విషయాలను ఇప్పటితో వదిలేస్తానని స్పష్టం చేశారు.

లక్ష్మీరెడ్డిని అరెస్టు చేసిన జైపూర్ పోలీసులు

విలేకరుల సమావేశాన్ని పూర్తిచేసుకుని ప్రెస్ మీట్ హాల్ నుండి కిందకు రాగానే అప్పటికే నిఘా ఉంచిన జైపూర్ పోలీసులు ఆమెను నిర్బంధించి వెంట తీసుకుపోయారు. యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఆమెను సైబర్ క్రైమ్ కేసులో అదుపులోకి తీసుకున్నట్లు ఏపీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులతో కలిసి రుయాలో వైద్య చికిత్సల నిమిత్తం తీసుకెళ్లారు.

స్విమ్స్ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న...

నర్సింగ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్విమ్స్‌లో గత 32 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెరగలేదని, గతంలో వార్డు బాయిలుగా ఉన్న వీరిని శానిటరీ వర్కర్లుగా మార్చారని, అదే వీరికి శాపంగా మారిందని, వెంటనే వార్డు బాయి గానే గుర్తించి వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. వారి సమస్యలను పట్టించుకోకుండా, నిత్యం వేధింపులకు గురిచేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా జరిగింది. ధర్నా అనంతరం సిఐటియు నేతలతో డైరెక్టర్ మెడికల్ సూపరింటెండెంట్ రాము, ఆర్ఎంఒ కోటిరెడ్డి, జిఎం బాబు, లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ జిఎం రాంకుమార్ చర్చలు జరిపారు. సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిబిఎస్ మణ్యం, కందారపు మురళి, నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.రవి మాట్లాడుతూ కార్మికులు గత 32 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వీరి సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని, యాజమాన్యం పట్టించుకోకపోగా, వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఇఎస్ఐ డాక్టర్లు సిక్ లీవు ఇచ్చినా ప్రభావతి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కార్మికులను అవమానకరంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని, ఈనెల 14న సమావేశం ఉందని, ఆ సమావేశంలో వేతనాల పెంపుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డు బాయిలుగా పేరు మారుస్తామని, తొలగించిన 60 మందిని విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. డైరెక్టర్ హామీతో ధర్నా విరమించారు. 15 రోజుల సమయం ఇస్తామని, సమస్య పరిష్కారం కాని పక్షంలో సమ్మెలోకి వెళతామని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, పి.చిన్న, బి.శ్రీరాములు, వి.సూరి, సుబ్రమణ్యం, గోపి, మారిముత్తు కుమార్, రాజా, నిషా, వెంకటేష్, కుమారి, లత, గీత పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలివ్వాలని సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు పిలుపు ఇచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి అర్బన్ రూరల్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఇల్లు లేని నిరుపేదలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో 90శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని తెలిపారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభ్కైవేలు మాత్రమే ఇచ్చిందన్నారు. చాలా చోట్ల ఇళ్ల స్థలాల లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తిరుపతి అర్బన్ రూరల్ ప్రాంతాలలో 30 వేలకు పైగా ఇంటి పట్టాలు మంజూరు చేశారని, తిరుపతి నగరానికి 35 కిలోమీటర్లు దూరంలో ఇళ్లు కేటాయించారని, అక్కడ నివాసయోగ్యంగా ఉన్న ప్రాంతాలలో ఇల్లు కట్టుకోలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆ లేఔట్లను రద్దు చేసి అర్హులకు స్థలాలు చూపాలన్నారు. ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, ఎన్ డి రవి, పద్మనాభరెడ్డి, ఎన్ శివ, శ్రీరాములు పాల్గొన్నారు.

– రేణిగుంట ఎంఆర్ఒ కార్యాలయం వద్ద కేతారి రాధాక్రిష్ణ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ మణి, మోహన్‌రెడ్డి, కార్తీక్, రజాక్ పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచే వరకూ పోరాటం

ప్రజాశక్తి - క్యాంపస్

స్టైఫండ్ పెంచే వరకూ సమ్మె విరమించే ప్రసక్తే లేదని, అప్పటివరకూ తమ పోరాటం కొనసాగుతుందని పశువైద్య విద్యార్థులు స్పష్టం చేవారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం తిరుపతి విద్యార్థుల నిరవధిక సమ్మె సోమవారానికి 8వ రోజుకు చేరుకుంది. రిలే నిరాహార దీక్ష 4వ రోజు కొనసాగుతోంది. వెటర్నరీ విద్యార్థుల స్టైపెండ్‌ను సమానమైన ఇతర వైద్య కోర్సుల స్థాయికి పెంచాలని, తమ ప్రధాన డిమాండ్ నెరవేరే వరకు ఈ పోరాటాన్ని నిలపబోమని విద్యార్థులు స్పష్టంగా తెలిపారు. సోమవారం తమ సమ్మెలో భాగంగా వెటర్నరీ విద్యార్థులు తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గతంలో 2022లో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు వెటర్నరీ విద్యార్థుల స్టైపెండ్ పెంపుపై హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలులోకి రాలేదని, 13 సంవత్సరాలుగా యుజి విద్యార్థులకు రూ. ఏడువేలు, పీజీ విద్యార్థులకు 9వేలు, పిహెచ్‌డి

8వ రోజూ పశువైద్య విద్యార్థుల సమ్మె

చేసేవారికి పదివేలు మాత్రమే అందుతోందన్నారు. ప్రస్తుతం ధరల భారాలు ఆకాశాన్నంటిన తరుణంలో ఈ స్టైఫండ్ ఏమాత్రం సరిపోదన్నారు. వినతిపత్రం ఇచ్చిన అనంతరం కలెక్టరేట్ నుంచి దీక్షా శిబిరానికి బైక్‌ర్యాలీగా వచ్చారు. ఇతర మెడికల్ విద్యార్థులకు సమానంగా తమ స్టైఫండ్ ఇవ్వాలని నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 249 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా నలుమూలల నుండి సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారుల సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్ మాండ్, శివశంకర్ నాయక్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కొన్ని అర్జీదారుల సమస్యలను సావధానంగా విన్న జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులను సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారం చూపాలని ఆదేశించారు. అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 155 అర్జీలు వచ్చాయి.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

తిరుపతి టౌన్ : ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 12 మంది, మరో 47 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని అదనపు కమిషనర్ తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ట్యాక్సీ స్టాండ్ వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వలన అదే జీవనంగా గడుపుతున్న ట్యాక్సీవాలా లకు ఇబ్బంది అవుతుందని పున్ణపరిశీలించాలని కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రలు కోరారు. కపిలతీర్థం నుండి నీరు ప్రవహించే కాలువకు అడుగుభాగం కాంక్రీట్ వేయడం వలన నీరు ఇంకడం లేదను పరిశీలించాలని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, ఇండ్ల కొరకు డబ్బులు కట్టామని ఇల్లు ఇవ్వలేదని, సుందయ్య నగర్ లో కుక్కల బెడద పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

వినియోగదారుడు మేల్కొనాలి : రాజారెడ్డి

తిరుపతి టౌన్ : నాణ్యత లేని కల్తీ వస్తువులపై వినియోగదారుడు మేల్కొనాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు పి.రాజారెడ్డి అన్నారు. తిరుపతి యూత్‌హాస్టల్లో రాయలసీమలోని మండల వినియోగదారుల సంఘ ప్రతినిధుల 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ.. చట్టం.. సమస్యలు'పై శిక్షణా కార్యక్రమం సోమవారం జరిగింది. వినియోగదారులకు ప్రధానంగా కల్తీ, నకిలీ, నాణ్యతా ప్రమాణాలు లేని వస్తువులను విక్రయిస్తూ విచ్చలవిడిగా దగా చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా జిల్లా వినియోగదారుల కమీషన్‌లో ఫిర్యాదు చేస్తే నష్టపరిహారం పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఎం.నాగేశ్వరరావు, శివమూర్తి, ఇమ్మాన్యుల్, సిసిఐ ప్రతినిధి సతీష్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శేషాద్రి పాల్గొన్నారు.

షాదిమహల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తిరుపతి టౌన్ : ముస్లింల అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆర్‌సి రోడ్డులోని షాదీమహల్‌లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అసంపూర్తిగా ఉన్న ప్రహరీగోడ, డ్రైనేజీ కాల్వ పనులను మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో పూర్తి చేస్తామన్నారు. ఈ రెండు పనులకు 8 లక్షల 30వేల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మహబూబ్‌బాషా, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

తనపై దాడిని లోక్‌సభలో ప్రస్తావించిన గురుమూర్తి

తిరుపతి టౌన్ : తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా ఓటింగ్‌కు వెళ్లే సందర్భంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో తనతో పాటు మేయర్ డాక్టర్ శిరీష, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యంతో పాటు వైసిపికి చెందిన కార్పొరేటర్లపై భౌతికదాడులకు పాల్పడినట్లు తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి చెప్పారు. లోక్‌సభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రత్యేక ప్రస్తావన 377 కింద ఆయన తనపై జరిగిన హింస గురించి ప్రస్తావించారు. తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా అధికారంలో ఉన్న కూటమి నేతలు ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కారన్నారు. ఇప్పటివరకూ ఈ ఘటనపై జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని సభ దృష్టికి తీసుకెళ్లారు.

కోర్టు స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

తిరుమల శ్రీవారి సేవలో...

తిరుపతి టౌన్ : తిరుపతి దామినేడు వద్ద కోర్టు భవన నిర్మాణానికి స్థలాన్ని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, చిత్తూరు ఉమ్మడి జిల్లా పోర్ట్ ఫోలియో అడ్మినిస్ట్రేషన్ హైకోర్టు జడ్జి బి. కష్ణ మోహన్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ వెంట రాగా సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. అనంతరం తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆయనకు వీడ్కోలు పలికారు. అంతకుముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

'హెచ్'బ్లాక్ పరిశీలించిన వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో శనివారం అర్ధరాత్రి 12 గంటలకు లైబ్రరీ సైన్స్ విద్యార్థిపై దాడి ఘటన నేపథ్యంలో హెచ్ బ్లాక్‌ను ఉప కులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు సోమవారం పరిశీలించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్‌వార్డెన్, సిడిసి డీన్‌లతో కమిటీని వేయడంతో పాటు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్ల వీసి తెలిపారు. హాస్టల్ బ్లాక్‌ల్లో తిష్టవేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని,వారికి అవకాశం కల్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని పోలీసులు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, డిప్యూటీ వార్డెన్ ఆచార్య నారాయణ పాల్గొన్నారు.

సెట్ కన్వీనర్‌గా నియామక పత్రాలు స్వీకరణ

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల కు కేటాయించిన ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను భాగంగా ఎస్వి యూనివర్సిటీ కి కేటాయించిన ఏపీ పీజీ సెట్ 2025 , ఏపీ రీసెట్ 2025 ప్రవేశ పరీక్షల యొక్క కన్వీనర్ నియామక పత్రాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా సోమవారం ఆచార్య పిసి వెంకటేశ్వర్లు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు


నియామక పత్రాలు అందుకుంటున్న ఆచార్య పిసి వెంకటేశ్వర్లు

కన్నవరం రోడ్డుకు మోక్షం ఎప్పుడు..? : సిపిఎం

- రోడ్ల దుస్థితిపై గ్రామస్తుల రాస్తారోకో
- ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలుసుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-సత్యవేడు: కన్నవరం - సత్యవేడు రోడ్డుకు మరమ్మతులు చేయాలని, గ్రామ ప్రజలు సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన, రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మెలుగు రమేష్ మాట్లాడుతూ విఆర్ కండ్రిగ-కన్నవరం రోడ్డు దుస్థితి వల్ల ప్రయాణికులు, గ్రామస్తులు నిత్యం ప్రమాదాలకు గురవతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. ఇప్పటికే అనేకమార్లు గ్రామస్తులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ సంబంధింత అధికారుల్లో స్పందన లేదని మండిపడ్డారు. వారు ఆఫీసు బల్లలకే పరిమితమ య్యారని ఎద్దేవా చేశారు. సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పసుపు గ్రూపు రాజకీయంలో తన ఉనికిని కాపాడుకునే పని మాని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఇప్పటికన్నా ప్రభుత్వం, అధికారులు, నాయకులు స్పందించి చిత్తశుద్ధితో రోడ్లను బాగు చేసి ప్రజలకు రవాణా సరైన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ, మంగయ్య, వరమ్మ, మునెమ్మ, గౌరి, లక్ష్మి, శాంత, సరోజమ్మ ,గోవిందమ్మ, మునెమ్మ, ముప్పయ్య, మౌలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : న్యాయ శాస్త్రం అభ్యసించిన విద్యార్థులు పట్టుభద్రులంతా సోషల్ ఇంజనీర్స్ అని, సామాజిక భవిష్యత్తు అంతా వారి పైన ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వై.ఆర్ హరగోపాల్ రెడ్డి అన్నారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో సోమవారం అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వై ఆర్ హరగోపాల్ రెడ్డి, అనంత లా కాలేజీ చైర్మన్ అనంత రవి, ప్రిన్సిపాల్ సి.నటరాజారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా అతిథులు న్యాయ రంగంలో మార్పును తీసుకురావాలంటే నిబద్ధత ముఖ్యమన్నారు.అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అనంత ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్, ప్రెసిడెంట్ జయ రామయ్య, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానం ఆవరణలో జిల్లాలోని నారాయణ పాఠశాలల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. జాతీయ క్రీడా జెండాలను ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా రాకెట్ ప్రయోగ నమూనా ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో ప్రతి ఒక్కరూ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల జిఎం విజయభాస్కర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దత్తాత్రేయ, అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జ్ విశ్వక్, క్లస్టర్ ప్రిన్సిపల్స్ రియాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ఆలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, రాఘవేంద్రనగర్‌లో శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయాన్ని నిర్మించి రెండు దశాబ్దాలు అయిన సందర్భంగా సోమవారం ప్రత్యక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, పులుగోరు మురళీ, శ్రీహరి రావు, శ్రీధర్ వర్మ, పాఠకం వెంకటేష్, కృష్ణమూర్తి, మణి వర్మ, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, కెఎంకె లోకేష్ తదితరులు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అసత్య ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళపూరు గ్రామానికి చెందిన సతీష్ యాదవ్ అనే వ్యక్తి తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు చించివేసిన కేసులో అతనే పోలీసులకు లొంగిపోయాడని, అతనిపై ఎవరు వేధింపులకు పాల్పడలేదన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యలు సత్యదూరమన్నారు. పోలీసు అధికారులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, అబ్దుల్ రహీం, మట్టం శ్రావణి రెడ్డి , వాటం బేడు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం, నేసనూరు గ్రామ పంచాయతీలో సోమవారం జరిగిన ఎరువుల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే భాను ప్రకాష్, రాష్ట్ర పద్మశాలి డైరక్టర్ గంజి మాధవయ్యలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఉప సంచాలకులు, రమేష్, వ్యవసాధికారి కోదండయ్య, ఎంపీడీవో రమేష్ బాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి బెస్ట్ రైడర్ ట్రోఫీ


ట్రోఫీలు అందుకున్న విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయ్యారు. వారిలో ఆర్ అండ్ వి వింగ్‌కు చెందిన క్యాడట్ లోకేష్ గుర్రపు స్వారిలో ఆల్ ఇండియా ట్రోఫీతో పాటు డ్రస్సాజ్ పోటీలో బంగారు పథకం, టెంట్ పెగ్గింగ్‌లో రజత పతకం సాధించాడు. క్యాడెట్ మహిమ రాజు డ్రస్సాజ్ పోటీలో రజత, కంచు పతకాలు సాధించారు. ఆర్మీ వింగ్‌కు చెందిన క్యాడట్ రమేష్ పరేడ్‌లో ప్రశంసలు పొందాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరుడు, ఎన్ సి సి అధికారులు రమేష్, ఉమా మహేశ్వరీ, పురుషోత్తం అధ్యాపకులు భీమన్న, రామకృష్ణారెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

తొక్కిసలాట బాధితులకు పరిహారం పంపిణీ

బాధితులకు చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో క్షతగాత్రులకు పరిహారం సోమవారం ఉదయం బర్డ్ ఆస్పత్రిలో చెక్కలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. తీవ్రంగా గాయపడ్డ టిటిడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని రాజేశ్వరికి ఐదు లక్షల రూపాయలు, గాయపడ్డ కృష్ణమ్మకు రెండు లక్షల రూపాయల చెక్కలను ఆయన అందించారు. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్యం టిటిడి, ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డ్ మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, ఏపి అర్బన్ డెవలప్మెంట్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ డైరక్టర్ వూకా విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు నరసింహ యాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, టిడిపి నాయకులు శ్రీధర్ వర్మ, జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, బండ్ల లక్ష్మీపతి రాయల్, కెఎంకె లోకేష్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు పునరుద్ధరించాలి

ఆర్‌టిసి రీజనల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కోట: ప్రజల సౌకర్యార్థం బస్సులను పునర్దించాలని బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, జిల్లా కోర్ కమిటీ సభ్యులు దువ్వూరు గిరిధర్ రెడ్డిలు సోమవారం ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆర్టీసీ చైర్మన్ కోట నుండి గూడూరుకు ఉదయం 5:30 గంటలకు బస్సు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ వినతిలో గూడూరు ఆర్టీసీ పరిధిలోని పల్లె వెలుగు బస్సులకు మరమ్మతులు చేయించాలని కోరారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణాలు సాగించడానికి ఇబ్బంది లేకుండా బస్సులు ఉదయంనుడి రాత్రి ఇళ్లకు చేరే సమయం వరకు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టీసీ చైర్మన్ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, దివిపాళెం పంచాయతీ, చవటపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాసులు, మంజిరి గోపాల్, పర్వతాల రమేష్, పేయ్యల రమణయ్య, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించండి

విద్యార్థులతో మాట్లాడుతున్న మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య సూచించారు. చంద్రగిరి పట్టణంలోని స్థానిక శ్రీ పద్మావతి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న "పరీక్ష పే చర్చ" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయంఓ శివ శంకరయ్య, ఏయన్ఓ సారధి, చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారులు లలిత కుమారి, భాస్కర్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో పోడియం యస్‌యచ్ఆర్ కార్యక్రమంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను జిల్లా నోడల్ అధికారి శివ శంకరయ్య, మండల నోడల్ అధికారి యంఇఓ భాస్కర్ బాబులు పర్యవేక్షించి సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు.

ఒత్తిడి అధిగమిస్తే పరీక్షల్లో విజయం తథ్యం

ప్రజాశక్తి -కోట : ఒత్తిడిని అధిగమించి పరీక్షలను బాగా రాయాలని ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. కోట మండలంలో స్థానిక మండల విద్యాశాఖ అధికారి దారా మస్తానయ్య ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కోట జడ్పీహెచ్ఎస్, జడ్పీ జి హెచ్ ఎస్, నెల్లూరు పల్లి కొత్తపాలెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రిచే నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించారు.

ప్రజాశక్తి - బి.ఎన్.కండ్రిగ

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం పరీక్ష పే చర్చ సమావేశం డిజిటల్ చిత్రం ద్వారా చూపించడం జరిగింది. ఈ కార్యక్రమం మండల తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, సుబ్రహ్మణ్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య

- వ్యవసాయశాఖాదికారి ధనలక్ష్మి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని మండల వ్యవసాయశాఖాదికారి ధనలక్ష్మి రైతులకు తెలిపారు. భవిష్యత్తులో పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంటనష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలు తదితరాలపై రాయితీ పొందాలంటే విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. ఇందుకు ప్రతి రైతు స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు నమోదు కార్యక్రమం ఈ నెల 10 వతేదీ నుండి చేపట్టడం జరుగుతుందన్నారు. పేరు, ఊరు, ఆధార్ నంబర్, పటాదారు పాస్ బుక్కు , ఆధార్‌కి లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలతో రైతు సేవా కేంద్రంలో ఫిబ్రవరి 28లోగా గుర్తింపు సంఖ్యను పొందాలని తెలియచేశారు. రైతు సేవా కేంద్రానికి వెళ్లలేకపోతే, అధికారులకు ఫోన్ చేసి వివరాలు తెలిపి ఓటీపీతో నమోదు చేసుకోవచ్చన్నారు.

డిజిటల్ గుర్తింపు కార్డు కోసం రైతులు రిజిస్టర్ చేయించుకోవాలి : వ్యవసాయ అధికారిణి భారతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: డిజిటల్ గుర్తింపు కార్డు కోసం మండలంలోని రైతులందరూ రిజిస్టర్ జాబితాలో వారి పేరును నమోదు చేయించుకోవాలని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ వ్యవసాయ మండల అధికారిణి భారతి కోరారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో డిజిటల్ కార్డు మంజూరుపై వివరించారు.

నులి పురుగులను నులిపేద్దాం

నులిపురుగుల నివారణకు మాత్రలు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జరిగింది. నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల హెల్త్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జయప్రద, సభ్యులు డాక్టర్ షర్మిల, పద్మావతి, సావిత్రి, హాస్పిటల్ వైద్య సిబ్బంది, అంగన్వాడీ ఆశా వర్కర్లు మౌన, హరిత, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెంలో..

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ కళ్యాణ్ కుమార్, డాక్టర్ లీనా కుమారిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో..

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ.: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని అంగన్వాడి స్కూళ్లు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 1నుండి19 సంవత్సరం పిల్లల వరకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, ఎండిఓ త్రివిక్రమ రావు, ఎమ్మార్వో సుబ్రహ్మణ్యం, ఎంఈఓ1 రవీంద్రనాథ్, ఎంఈఓ 2 సుబ్రమణ్యం, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని వివిధ పాఠశాలల్లో మండల వైద్యాధికారి డాక్టర్ కుసుమ, డాక్టర్ ప్రియాంకల ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటం మణారెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఈశ్వరయ్య, వెంకటేశ్వరరావు, వాసు, శ్యామల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఏడు రోజుల వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జనాభా విద్య విభాగం, ఎకనామెట్రిక్స్ విభాగాలు కలిసి 7 రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభించారు. విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఆచార్యులు బోధించడానికి అవసరమైన నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో కాలేజీలలో అధ్యాపకుల పాటించాల్సిన విధివిధానాల గురించి చెప్పారు. జనాభా విద్య విభాగాధిపతి ప్రొఫెసర్ సాయి సుజాత మాట్లాడుతూ నూతన విద్యా విధానం, విద్యా సంస్థలలో బోధన, పరిశోధన, వృత్తిపరమైన వృద్ధి నాణ్యతను మెరుగుపరచడానికి డెవలప్మెంట్ ప్రోగ్రాములు చాలా అవసరం అని తెలిపారు. వక్త ప్రొఫెసర్ ఐవీ లలిత కుమారి బోధన నైపుణ్యాలను పెంపొందించడం, పరిశోధన, పండిత వృద్ధి, వృత్తిపరమైన అభివృద్ధి, సాంకేతిక సమగ్రత అభివృద్ధి, వ్యక్తిగత వృద్ధి గురించి వివరించారు. ప్రొఫెసర్, సోషల్ వర్క్ కోఆర్డినేటర్ చంద్రశేఖరయ్య మాట్లాడుతూ ఎఫ్డిపీలు బోధన పరిశోధన, మొత్తం విద్య వాతావరణంలో నిరంతర అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఎఫ్డిపి ఒక సాధనంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎంవి వినోదిని, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సునీత పాల్గొన్నారు ఇందులో అధ్యాపకులు, అతిథి ఆధ్యాపకులు పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగలాపురం ఎడి రమేష్, ఏపీ విజయమ్మ సయుక్తంగా పిలుపునిచ్చారు. స్త్రీశక్తి భవనంలో సోమవారం ఏపీఎం చంద్రకళ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతీ ఇంటినీ సూర్యఘర్ వెలుగులతో నింపుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పథకాన్ని పరిపూర్ణంగా వర్తింప చేయాలని సంఘమిత్రలకు ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ లకు పీఎం సూర్యఘర్ పథకాన్ని ఉచితంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు రూ.2 లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఇంటి కప్పుపై ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చునన్నారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్రమణ్యం , సిసి లు నాగేంద్ర బాబు , సుబ్రమణ్యం , శశికళ , సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నింద్ర మండలం, మేలంబాకంలో ఉచిత మెగా వైద్య శిబిరం అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, అమెరికా, భూపతి రాజు పండేటి వారి సహకారంతో, పుత్తూరు పట్టణ ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ప్రోత్సహంతో, ఉషోదయ వాకర్స్ ఫౌండర్ కోనేటి రవిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్యాంపుకి ముఖ్య అతిథులుగా చమర్తి శోభా రాజు, చెన్నై, డాక్టర్ రవిరాజు రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్, గ్రామ సర్పంచ్ బాలకృష్ణమరాజు, ఏంఈఓ ప్రభాకర్ రాజు, కోనేటిరావిరాజు, కె.చంద్రబాబులు పాల్గొన్నారు. తిరుపతి మాధురి రెమిడి హాస్పిటల్, డి.బి.ఆర్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పటల్ డాక్టర్స్, సిబ్బంది పాల్గొని పరిసర గ్రామ ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపినీ చేశారు. 35 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నారు. ఈ శిబిరంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి. బాబు, కార్యదర్శి హె చ్. రామ్మోహనవర్మ, ట్రెజరర్, ఆర్. రమేష్ రాజు వాకర్స్ సభ్యులు, గ్రామ పెద్దలు నాగభూషణం రాజు, మోహనరాజు,లక్ష్మీపతి రాజు,సుబ్రహ్మణ్యరాజు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కెఎల్ యూనివర్శిటి

అవకతవకలపై విచారణ చేపట్టాలి

- ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పర నాగేశ్వరరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించేందుకు ముడుపులు ఇచ్చి సీబీఐకి అడ్డంగా దొరికిన కెఎల్ యూనివర్శిటీ యాజమాన్యంపై, అక్కడ జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డా. ఉప్పర నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కెఎల్ యూనివర్శిటీ అడ్మిషన్లు పెంచుకోవడానికి ప్లేస్‌మెంట్లు ఎక్కువ ఇస్తున్నామని బూటకపు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్ పొందిన వారిలో చాలా మందిని కేవలం మూడు లేదా నాలుగు నెలలకే ఉద్యోగం నుంచి తొలగించబడ్డారని, వారి పనితీరు సరిగ్గా లేదని కారణంగా చూపారని తమకు సమాచారం అందిందన్నారు. అక్రమంగా డొనేషన్లు వసూలు చేయడం, కావాలని విద్యార్థులను ఫెయిల్ చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం అత్యున్నత కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కోరారు. బీసీ, యస్సీ, ఎస్టి, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించి మంచి విద్య కోసం ప్రైవేట్ యూనివర్సిటీలను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకొని కెఎల్ యునివర్సిటీ యాజమాన్యం అవకతవకలకు పాల్పడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవకతవకలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) :: తిరుపతి
H.M.O.P. No. 198 of 2024
సమ్మెట నిర్మల, W/o ఎస్. సుబ్రమణ్యం రాజు, D/o మార్కండేయ రాజు, D.No.6-146, ఎల్లమరాజు వీధి, కార్వేటి నగరం, కార్వేటి నగరం మండలం, చిత్తూరు జిల్లా ... వాది
VS
ఎస్. సుబ్రమణ్యం రాజు @ బాబు S/o ఎస్. వెంకటరాజు(లేట్) R/o డోర్ నెం. 101, 1st ఫ్లోర్, GDK అపార్ట్మెంట్స్, ఉమ దేవి హాస్పిటల్, విఘ్నేశ్వర నగర్, తిరుపతి, తిరుపతి మండలం మరియు జిల్లా. ... ప్రతివాది
దావా యందు సమన్లు
ఇందుమూలముగా, ప్రతివాదికి తెలియచేయునది ఏమనగా గౌరవ ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తిరుపతి, న్యాయమూర్తి గారి ఆదేశాల మేరకు, ప్రతివాది తేది 25.02.2025 న సదరు గౌరవ న్యాయమూర్తి గారి కోర్టు నందు ఉదయం 10.30 గంటలకు మీరు గాని లేదా మీ వకీలు ద్వారాగాని హాజరై మీ తరపు వాదన తెలుపవలెను. అట్లు సదరు గౌరవ న్యాయమూర్తి గారి ఆజ్ఞ అనుసరించక, హాజరు కాని పక్షములో మీ పరోక్షములో తీర్మానం తీసుకొనబడను.
దావా తేది : 25.02.2025
నందివాడ జగదీష్ ప్రసాద్,
వాది తరుపు న్యాయవాది,
తిరుపతి. మొబైల్ : 7032303862

క్రైం న్యూస్

గుర్తుతెలియని వాహనం ఢీ : వ్యక్తి మృతి

మృతి చెందిన బంగారు సారంగన్

తడ - ప్రజాశక్తి : తడ మండలం, పన్నంగాడు గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని బంగారు సారంగన్ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. తడ పోలీసు వారు అందించిన సమాచారం మేరకు గుమ్మిడి పూడి, పెద్ది కుప్పం పంచాయతీ, సామిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన బంగారు సారంగన్ (55) కూలి పనికోసం వెళుతుండగా 8 గంటల ప్రాంతంలో, పన్నంగాడు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే చనిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

మృతి చెందిన మాణిక్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గోవిందరాజు స్వామి గుడి కోనేరు ముందున్న వినాయక గుడి వద్ద కొర్లగుంటకు చెందిన విజయభాస్కర్ రెడ్డి తన వాహనానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి వాహనాన్ని తీసే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. గుడి ముందు బిక్షయాటన చేసే వృద్ధుడు మాణిక్యం అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, లారీ ఢీ : యువకుడి మృతి

మృతి చెందిన వినోద్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతిరూరల్ మండలం పాతకాల్వకు చెందిన వినోద్ కుమార్ (21) తమ ఊర్లో జాతర విషయాన్ని వరమాల పేటలో ఉన్న బంధువులకు చెప్పేందుకు ద్విచక్ర వాహనంపై నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై వెళుతుండగా, తిరుపతి రూరల్ వేదాంతపురం సర్కిల్ సమీపంలోని, సదరన్ స్పైస్ ఎదురుగా లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో లారీ వెనుకవైపు టైరు కిందపడి వినోద్ కుమార్ అక్కడకక్కడ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంఆర్ పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం మొక్కలు స్వాధీనం

ఎర్రచందనం మొక్కలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం : వాహనంతో సహా ఎర్రచందనం మొక్కలు పట్టుబడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మల్లి కార్జున్ అందించిన సమాచారం మేరకు తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో ఎంజీ నగర్ గ్రామ పరిధిలో ఊరిబయట పాడుబడిన ఇంటిముందు అనుమానాస్పదంగా ఉన్న కారుని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అందులో వేర్లతో సహా ఉన్న ఎనిమిది ఎర్రచందనం మొక్కలను గుర్తించడం జరిగింది. వాటికి సంబంధించిన వ్యక్తులు ఎవరు లేకపోవడంతో కేసు నమోదు ఎస్ఐ విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులు, సిబ్బంది ప్రాధాన్యం ఇవ్వాలని డిఎస్పీ నరసింహమూర్తి సూచించారు. బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్ సోమవారం తనిఖీ చేశారు. వివిధ కేసులను త్వరగా విచారించాలని రూరల్ సిఐ, ఎస్ఐలకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No. 27 of 2024 in A.S.No. 4/2024
శ్రీ మల్లెల జయరామయ్య మరియు ఇంకొకరు. ...పిటీషనర్స్
Vs
శ్రీ కె.భరత్ మరియు వగైరాలు. ...రెస్పాండెంట్స్
2&5 రెస్పాండెంట్స్‌నకు నోటీసు
రెస్పాండెంట్స్ 2&5:
2. మల్లెల తిరుమల, S/o జయరామయ్య, నివాసం: బండ మీద కమ్మపల్లి, నెరబైలు గ్రామం, ఉదయమాణిక్యం పోస్ట్, యెర్రావారిపాలెం మండలం, తిరుపతి జిల్లా, (పూర్వపు చిత్తూరు జిల్లా)
5. కంచి చంద్రశేఖర్, S/o సుబ్రమణ్యం, నివాసం: డోర్‌నెం. 6-3-174బి, మంచాల వీధి, తిరుపతి టౌన్, అర్బన్ మండలం, తిరుపతి జిల్లా (పూర్వపు చిత్తూరు జిల్లా).
పై పిటిషనర్స్ దాఖలు చేసిన పై పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కనిన పిటిషన్‌ను తేది: 04.03.2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 04.03.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాద నలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేడయమైనది.
//By Order of the Court//
కె.జితేంద్ర
వి.మునార్ బీ
న్యాయవాదులు, పీలేరు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No. 4/2024
శ్రీ మల్లెల జయరామయ్య మరియు ఇంకొకరు. ...అప్పీల్దారులు
Vs
శ్రీ కె.భరత్ మరియు వగైరాలు. ...రెస్పాండెంట్స్
2&5 రెస్పాండెంట్స్‌నకు అప్పీల్ సమను
రెస్పాండెంట్స్ 2&5:
2. మల్లెల తిరుమల, S/o జయరామయ్య, నివాసం: బండ మీద కమ్మపల్లి, నెరబైలు గ్రామం, ఉదయమాణిక్యం పోస్ట్, యెర్రావారిపాలెం మండలం, తిరుపతి జిల్లా, (పూర్వపు చిత్తూరు జిల్లా)
5. కంచి చంద్రశేఖర్, S/o సుబ్రమణ్యం, నివాసం: డోర్‌నెం. 6-3-174బి, మంచాల వీధి, తిరుపతి టౌన్, అర్బన్ మండలం, తిరుపతి జిల్లా (పూర్వపు చిత్తూరు జిల్లా).
పై అప్పీదారులు దాఖలు చేసిన పై అప్పీల్ దావా నందు మీ హాజరు నిమిత్తమై పై కనిన అప్పీల్ దావాను తేది: 04.03.2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 04.03.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాద నలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేడయమైనది.
//By Order of the Court//
కె.జితేంద్ర
వి.మునార్ బీ
న్యాయవాదులు, పీలేరు.